స్కెచ్

# అయాచిత దైవం

అవసరాల రామకృష్ణారావు

అదృష్టం కనిపించని వస్తువు. అది ఎప్పుడొస్తుందో ఏ రూపంలో వస్తుందో ఎవరికీ తెలీదు. సరిగ్గా దురదృష్టమూ అలాంటిదే.

శాస్త్రి నిన్నటికి తన సొంత ఊళ్లో ఆస్తి ఉన్న పెద్దమనిషి. ఇవాళ చేతిలో కాణీ లేక దొరికిన దారి పుచ్చుకుని పరాయి ఊళ్ళో వెర్రిగా తిరుగుతున్నాడు. తెలియని ఊరూ, పట్నవాసమూ...వచ్చిన పనా అవలేదు. పర్సు కాస్తా ఎక్కడో జారిపోయింది. ఎవరి నడుగుతాడు? మానుషంగల మనిషాయెను. స్థానబలిమి లేకపోయింది! తను బయలుదేరేటప్పుడు ఏ శకునపక్షి ఎదురైందో చూసుకున్నాడు గాదు-ఎన్నుకుంటే ఏం లాభం?

బాధ, చిరాకు, దైన్యావస్థ యివి చాలక చీకటిలా ఆకలి అలుముకుంది. వీధి కొళాయి దగ్గిర కడుపు పట్టినన్ని మంచినీళ్లు తాగేడు. పర్సు ఎవడు కొట్టేశాడో వాడ్ని మనసులో వచ్చినన్ని తిట్లుతిట్టి-దారీ తెన్నూ తోచక అలా నడుస్తున్నాడు.

"ఏయ్"...శాస్త్రి తన్ని కాదనుకున్నాడు. మళ్లీ కేక వినిపించియిటు తిరిగి చూశాడు. పోలీసు.

"ఏం పిలుస్తే వినబడ్డంలేదా ఏమిటి? చెవుడా?" శాస్త్రికి ఒళ్లు మండిపోయింది. పోలీసు దగ్గిరగా వచ్చాడు.

"ఏమిటా నోటి దూకుడు? ఎవరు నువ్వు? నాతో ఏం పని?"

"నే నెవరో చూస్తే తెలీడంలేదా ఏమిటి?"

"తెలుస్తూనే ఉంది-ఏం నన్ను పట్టుకుందామనా?"

"అవును-పద."

ఈసారి శాస్త్రికి ఆశ్చర్యమే వేసింది. యూనిఫారంలో ఉన్న పోలీసు-వలిగిన పంచె, వెలిసిన కండువా, నున్నని మండువాగల శాస్త్రిని వచ్చి రెక్క పట్టుకున్నాడు. శాస్త్రికి చెమట పట్టింది.

"ఏమిటిదీ? ఎక్కడికీ? నన్ను వదులు."

"పద స్టేషనుకి-అక్కడే చెబుతాను ఎందుకో."

"మంచి సిటీ సెంటరులో కుడిచేతివైపునుంచి నడుస్తున్నావ్. 'కీప్‌టు లెఫ్ట్' అన్న ముక్కలు నీకు కనపడలేదా?"

ఈ అరవై రూపాయిల శిస్తుగల ఆసామీ ఆరెకరాల మాగాణీగల తనని నడిరోడ్డుమీద నిలబెట్టేశాడు. వానలు పడమంటే ఎలా పడతాయి?

"కుడిచేతివైపు నడవడం ఓ తప్పటయ్యా? దానికి ఓ శిక్షటయ్యా? ఎవరిష్టం వచ్చినట్టు వాళ్లు నడవడానికేనా స్వాతంత్ర్యం లేదా?"

"నువ్వుచేసిన తప్పుగాక ట్రాఫిక్ రూల్సుని ఎదిరిస్తున్నావ్-ఈసారి నిన్ను వదిలితే దేశానికి అపచారం చేసినట్టవుతుంది పద."

"నిండా మునిగేక చలేమిటి? ఏమైతే అవుతుంది పద." ఏంచేస్తారేమిటి పోలీస్‌స్టేషన్‌లో, పీక తీసెయ్యరుగదా అనుకున్నాడు శాస్త్రి. మెయిన్‌రోడ్డుదాటి యిద్దరూ ఓ సందులోంచి నడుస్తున్నారు.

"పిల్లలుగలవాడివి, ఎందుకు అల్లరిపడతావ్?"

శాస్త్రికి ఏమిటో అర్థంకాలేదు.

"అంతమంది జనంలో డ్యూటీలో ఉన్నప్పుడు పట్టుకోకపోతే బాగుండదని పట్టుకున్నానుగాని-ఈ రూల్సు నాకుమాత్రం నచ్చాయనుకున్నావా? మనిషి ఎటువైపు నడుస్తే ఏం? సైకిలు ఎంతమంది ఎక్కితే ఏం? ఎటొచ్చీ యిలాంటి పనులు మా కళ్ళబడకూడదు. మీరూ పెద్దమనుషులు గదా! ఆమాత్రం గమనించకపోతే ఎలాగండీ?"

"స్టేషనుదాకా ఎందుకు? మాకేం కావాలో మీకు తెలీదు గనకనా? మామూలు యిప్పించెయ్యండి- వెళ్ళిపోతాను."

దేముడి మొదలు రాక్షసుడివరకూ కావలసింది సువర్ణ మంత్రపుష్పం! ఒక్కరూపాయి కళ్ళజూపిస్తే ఈ శనిగ్రహం మాయమౌతుంది. వెధవది

తను సంభావన యిచ్చినపాటిలేదు! అయితేనేం? దూరంగా వున్నప్పుడే - దొరకనప్పుడే మనుషులకీ వస్తువులకీ విలువ. తనదగ్గర దమ్మిడీలేదు. ఆ సంగతి ఈ 'జీడి' చెప్పినా నమ్మడంలేదు. రూపాయి, అర్థ, పావలావరకు బేరమాడేడు.

"బ్రాహ్మడివి. నిన్ను దుఃఖపెట్టి నాకేంలాభం? ఓ బేడయిలా పారెయ్య యింతదూరంవచ్చి ఎలా పోను, కాఫీఖర్చు" అన్నాడు పోలీసు...

"ఓరి నియోగీ! నీ యోగమెలావుందో నేనేం చెయ్యను? స్టేషనుదగ్గిర కొచ్చేశాం పద" శాస్త్రి రెక్కపట్టుకుని బరబరాలోపలికి లాక్కొచ్చాడు. సమయానికి సర్కిలు అక్కడే ఉన్నాడు. శాస్త్రికి ఏడుపేవచ్చేసింది! శాస్త్రిచేసిన నేరాలు పోలీసు విడమర్చి చెప్పేడు. ఇంకా చెప్పుకు పోతూనే ఉన్నాడు. సర్కిలు యినస్పెక్టరు యివేవీ వినలేదు. కొంతసేపటికి తలెత్తి చూశాడు.

"ఎవరూ? శాస్త్రిమేష్టారా? నమస్కారమండీ- ఒరే టూ నాట్ ఫోర్ వెల్ కం అయ్యరుదగ్గిర కెళ్లి నేనుచెప్పేనని ఓ స్పెషల్ కాఫీ పట్టుకురారా"

శాస్త్రికి క్రింద భూమీ పైన ఆకాశం అందలేదు. ఆ సర్కిల్ ఎవడో చూసినట్టయినా గుర్తులేదు. అవమానం తప్పగా ఏమిటీ సన్మానం?

"ఏమిటలా తెల్లబోయి చూస్తున్నారు? నేనండీ శివశంకరాన్ని. మీదగ్గిర సంస్కృతం చదువుకోలేదూ? ఆ రోజుల్లో మీరంతగా చావగొట్టి ఆ శ్లోకాలు బోధపరచబట్టి ఈనాడు బియ్యే సహా సేన్ స్క్రీప్టిట్ తో ఫస్టుక్లాసులో ప్యాసయ్యాను"

శివశంకరం శాస్త్రికి గుర్తువచ్చాడో లేదో చెప్పలేం. ఈత రానివాడు నిండామునిగినట్లు ఉక్కిరిబిక్కిరి అయినమాట మాత్రం నిజం.

"నామీద అభిమానముండబట్టి వెతుక్కుని వచ్చారు. అయితేనేం, చాలాకాలమవడంవల్ల వెంటనే గుర్తించలేకపోయారు. అవునా?"

"అవునోయ్ శివశంకరం. చాలా ఎదిగిపోయావు. నిన్నీస్థితిలో చూస్తే ఎంతో సంతోషంగా ఉంది. పెళ్ళి చేసుకున్నావా, ఏమైనా పిల్లలా?"

శివశంకరం ఏం జవాబు చెప్పలేదు. అన్నిటికీ కలిపి-

"అంతా మీదయ" అనేసి ఊరుకున్నాడు.

"ఏడిరా టూ నాట్ ఫోర్?"

"దార్లో వాడికి కడుపునొప్పి వచ్చిందిటండీ- అలా యింటికిపోయాడు" పోలీసుకి ఎందుకు కడుపునొప్పి వచ్చిందో శాస్త్రికి తెలుసు. నవ్వుకున్నాడు. వాడిసంగతి తేల్చెయ్యాలి.

"అందాకా కాఫీ తీసుకోండి. ఇదుగో యీ కాగితాలు అయిపోగానే యింటికి వెడదాం. మీరు రాత్రికి యింకోచోటికి వెడితే నే ఒప్పుకునేదిలేదు." శాస్త్రి ఏమీ అడ్డుచెప్పలేదు. కడుపులో గంతులేస్తున్న కాకిపిల్ల నోరెత్తనియ్యలేదు. శివశంకరం టెలీఫోను డయల్ త్రిప్పేడు. శాస్త్రివైపు చూసి చిరునవ్వుతో అన్నాడు.

"ఇవాళ టౌన్ హాల్లో "పాదుకా పట్టాభిషేకం" నాటకం మేష్టారూ! గొప్ప కాంబినేషన్, టూ సీట్స్ రిజర్వ్ చేయిస్తానూ?" శాస్త్రి దానికి మాట్లాడలేదు. కాళ్లు యింకా సరిగ్గా భూమిని అనడంలేదు. అతిథి సత్కారం సంగతి వేరేచెప్ప నక్కరలేదు.

"ఇంకొక్కరోజు ఉండమంటే ఉండడంలేదు. నేనేం చెయ్యను? నాకారుయిచ్చే పంపించి ఉందును. ఇవాళే కాకినాడలో కాన్ఫరెన్సు ఉంది—నన్ను మాత్రం జ్ఞాపకం ఉంచుకోండి మేష్టారూ! చూడు వెంకటసామీ, ఈయనకి బస్సులో ఫ్రంటుసీటు రిజర్వుచేయించు. కారువాళ్ళకి ఏం యివ్వక్కర్లేదు సుమండీ" పైకీ, మనస్సులోనూ ఆపదలో అవతరించిన యీ అయాచిత దైవాన్ని తనివితీరా దీవించి తుని బస్సెక్కేడు శాస్త్రి.

శివశంకరం దగ్గిర ఉన్న రాత్రీ - మర్నాడు వచ్చేసేముందూ, ఆ పోలీసు గురించి - తన్నంత అల్లరిపెట్టి, చిన్న కారణంకోసం నడిరోడ్డుమీద నిలబెట్టిన టూనాట్ ఫోర్ గురించి కోపంతీరా సర్కిల్ తో చెప్పేద్దామనుకున్నాడు శాస్త్రి. కాని మనస్సాక్షి ఒప్పుకోలేదు. చేతిలో దమ్మిడీ లేని దిక్కుమాలిన స్థితిలోంచి- తలపెట్టని స్వర్గంలోకి తీసుకెళ్లినవాడు! కాఫీ ఫ్రీ. భోజనం ఫ్రీ. నాటకం, ఆఖరికి బస్సు టిక్కెట్లు కూడా ఫ్రీ. ఈ పట్టాభిషేకం ఎలా వచ్చింది? వెర్రివెధవ పాపం ఒక్క రూపాయి అడిగేడు-తనే యివ్వలేకపోయాడు. తిడదామన్నా, చేతిలో ఏమైనా పెడదామన్నా, ఏడీవాడు? ★